# మోసం

"పెద్దోడివే కానీ గురూ, నీకేటీ తెల్దుగురూ" అన్నాడు రాకెట్ అప్పారావు.

గురుడు ముఖం వేలేసుకున్నాడు.

రాత్రి పది గంటలయింది. ఇద్దరూ గురు ఇంట్లో నడవలో నులక మంచంమీద కూర్చున్నారు. చీకటిగా చలిగా తడిగా వుంది. పైన కమ్మల మీద వర్షం దడదడ లాడిస్తోంది. వీధిలోంచి కుళ్ళువాసన ఉండి ఉండి గుప్పున కొడుతోంది. గురుడు చుట్టా, శిష్యుడు సిగరెట్టూ కాలుస్తున్నారని వాసనబట్టి తెలుస్తోంది. వాన తడికి చీకటి మరీ బిగిసిపోయిందేమో, వాళ్ళిద్దరూ నీడలో నీడల్లా ఉన్నారు.

రాకెట్ అప్పారావుకి పాతికేళ్ళుండవచ్చు. మీసం గడ్డం సరిలేక పోడంచేత ఇంకా లేతగా కనిపిస్తాడు. పొట్టిగా ఉండడంచేత కొన్నాళ్ళు అతణ్ణి అందరూ "ఒరే! జపాన్" అని పిల్చేవారు. సైకిలెక్కి ఓ జవానొకసారి అతణ్ణి వెంటబడితే మూడు గాలన్ల సారా మోస్తూనే రంయ్‌మని రాకెట్లా పరిగెట్టి జవాన్ని మెడ్డీసేడతను. అప్పటినుంచే రాకెట్ అప్పారా వయేడు. అతను సంబరాల్లో ఏ ఆడదాన్నయినా ఏ మూలకైనా వెళ్ళి 'అటాక్' ఇచ్చేస్తాడు. అందుచేత బాణంమార్కు అప్పారావని కూడా రసజ్ఞులతణ్ణి పిలుస్తారు. లైలాలయెడల అతను మజ్నూ, సారాయిలో 'దేవదాసే దేవదాసు మనోడే మనోడు.'

గురుడి పేరు గురవయ్య. మొదట్లో సారా కూలీలకి పైలట్ గా ఉండేవాడు. కాని, జవానెవడో, మనిషెవడో సరిగా పోల్చుకోగలిగే జ్ఞానం అతనికి లేకపోవడంవల్ల చాలామంది కూలీలు జెయిలుకిపోవడం, వారి షావుకార్లు దెబ్బతినేడం జరిగింది! తరువాత సారాకూలీగా కుదురుకున్నాడు. సత్తువైన మనిషవడంచేత ఎక్కువ సారా మోయగలిగే వాడు. ఎంత యెక్కువ మోసినా అదంతా వ్యర్థమే. పోలీసు లతణ్ణి మూడు నిమిషాల్లో పట్టేసేవారు. తరువాత స్వంతంగా వ్యాపారం పెట్టుకొని స్వయంగా చాలా డబ్బు పోగొట్టుకున్నాడు. అతనికి ముప్పయ్యయిదేళ్ళుండవచ్చు. ఇంకా ఎక్కువ వయసువాళ్ళా వుంటాడు.

"యాపారంలోకి దిగి సెడిపోన్నా నా శిసువా!" అన్నాడు గురుడు.

"నీ కేటీ తెల్దుగురూ!" అని మళ్ళీ అన్నాడు రాకెట్టు.

"తెల్దు" అని గురుడు వప్పేసుకున్నాడు.

"అందుకే కాకావోడిలా, నీ పెళ్ళాన్ని గెద్ద తన్నుకు పోయినట్టు తన్నుకుపోన్డు" అన్నాడు రాకెట్టు.

"దొంగ నంజికొడుకు. నమ్మించి దగాచేసేడు నంజికొడుకు."

"ఆడిసేత ఇప్పుడది టీకొట్టు ఎట్టంచింది. సారా అమ్మిస్తుంది. ఆడికి మదుపులేని యాపారం."

"అలా సూస్తావుండు. లంజికొడుకుని నరికేస్తానో నేదో!"

"ఆ పని నా కొగ్గీ; ఆణ్ని కికాప్ జేయిస్సి నీ పెళ్లాన్ని నీ కప్పజెప్పే పూసీ నాది. కాని గురూ! ఒక్క మాటిను. ఎంతసెడ్డా నువ్వు నాకు గురువ్వి. తొలీత నాను కూలికొచ్చింది నీ యెనకే. ఆ ఇశ్వాసం నాకుంది. అందుసేత నీ పెళ్ళాన్ని నీ కప్పజెప్తా. అయితే నువ్వెర్రి పీరువి, బావుపడే నచ్చనాలు నేవంటే నేవు. నువ్వు బావుపడాలంటే శిశువుని గురువుకి బోధజేస్తున్నాను, ఇనుకో! నువ్వేకాదు, నోకంలో యెవరు ఈ రోజుల్లో బావుపడాలన్నా, డబ్బుండాలి! మాయుండాల. డబాయింపు సెక్సనుండాలి! బోధపడిందా! డబ్బులో దేవుడున్నాడు."

"అందులో లేన్దేటుంది గనక?"

"అవును గురూ! డబ్బులో అన్నీ వున్నాయి. కాపోడు, మాలోడు, బేపనోడు, రాసోడు, కోవిఁటోడు డబ్బుంటే అంతమందిరీ దేవుళ్ళే. లచ్చి తల్లికి జాతిభేదం నేదు. రైటేనా?"

"రైట్!"

"ఆ లచ్చి తల్లి యెందల వుంది? యెందలబడితే అందలే వుంది. ఆ యమ్మ యెందలనేదు? నాయెంలనేదు. అన్నేయంల వుందిగాని నాయెంల నేదు. రైటేనా!"

"నువ్వు నాయెంగ బతికేవు. బతికితె నీ కేటొచ్చింది?"

"సేతికి సిప్ప!"

"అందుసేత, ఏటన్నా మాటా? సారాల నీళ్ళొయ్యాల, నల్లమందుల మన్ను కలపాల. బ్రాకెట్ల దొంగతిరి సెప్పాల! బియ్యెంల రాళ్ళు కలపాల, బియ్యే ఎమ్మేలు లంచాలు కొట్టాల! అప్పుడే డబ్బు."

"బాగా సెప్పేవు."

"నాను సెప్పిందే కాదరా గురూ! మొన్న పార్కుల జెజాడవోడెవుడోగాని పెద్ద 'పీచ్' ఇచ్చి అందల ఆడు జెప్పేడు. మాబాగా జెప్పినాళ్ళె. ఉంచతగ్గోడు, అయితే, 'యీ మాయపనులూ దొంగపనులూ సెయ్యడానికి అడ్డొచ్చేదేదీ?' అని అడిగినాడు. అడ్డొచ్చేది గవర్నమెంటూ అని ఆడే జెప్పినాడు? 'మరయితే సేసేవోళ్ళంతా మాయపన్లు యెలా

సేస్తున్నారు? అసలు యీ గవర్నమెంటంటే ఏటి?' అని అడిగినాడు. 'గవుర్నమెంటంటే ఏటి? జెప్పు?"

"ఏటా?" ఆలోచించేడు గురుడు.

"ఆఁ, ఏటీ?"

"సెప్తానుండు, గవర్నమెంటంటే వోట్లు."

"కాదు"

"మరయితే యేటి?"

"నోట్లు!"

"అవున్రన! మా బాగా సెప్పేవు! ఆ మద్దెల ఎలక్‌సాన్లకి బట్టలషావుకారు పెచారానికి పిలిస్తే ఎళ్ళేను. పెచారానికి నాలుగిస్తానని ముందల జెప్పి ఆ యెనక అయిదు పెచారాలకి పదిచ్చి 'శాన శాన' పొమ్మని గసిరీసినాడు. నంజికొడుకు. ఆడి ఎకస్పార్టీ నంజికొడుకు ఆడేటి జేసేడంటే, తొల్త అయిదిస్తానన్సెప్పి, ఆ యెనక వోటేయించుకున్నాక నా సేతల రెండెట్టేడు! సూడీ అన్నేయం."

"మరేటనుకున్నావు! మాయలంజికొడుకు లంతే సేస్తారు. అయితే-గర్నమెంటంటె డబ్బేగదా? డబ్బే! కాని మనకి పైక్కానిపించేదేటి?"

"ఏటి? సెప్పు."

"తెల్లార్లెగిస్తే మనక్కానిపించే దేటి?"

"పోలీసోడి టోపి."

"పస్టుక్లాసేర గురూ! పనికొస్తావు. పరవానేదు. నిజం కనిపెట్టేవు. ఆడు సెప్పిందీ అదే? గవర్నమెంటంటే మనకి పోలీసోడు. మన పళ్ళెటూళ్ళంట మున్సీబు, కర్నాలు. పైకెల్తె తాసిల్‌దార్, కలెట్టు, ఇంకాపైకెళ్ళి గవర్న మెంటేటని జూస్తే ఎమ్మెల్యే నెంబరు, ఆడి పైని మినిస్టు! అసలు సంగతది. ఈళ్ళందరూ గవర్నమెంటు. అంచేత ఆళ్ళ అడ్డు మనకి నేకుండ ఉండాలంటే ఆళ్ళని మనమే డబ్బెట్టి నిలబెట్టాల; లేకపోతే ఆళ్ళని కొనాల. అంటే-డబ్బున్న పెద్ద పెద్ద మాయగోళ్ళు అసలు గవుర్నమెంటు! ఆళ్ళు ఈళ్ళందర్నీ కొనుక్కానిలబెట్టుకున్నారు. అందుకేరా గురూ! డబ్బుండాల, మాయుండాల, డబాయింపు సెక్సనుండాల!"

-అని ఈ విధంగా గురువుకి రాజనీతి, బతుకుతెరువూ వగైరా విషయాల గురించి బోధించి బోధించి చివరికి అసలు విషయంలోకి దిగేడు రాకెట్టు.

"మూణ్రోజులయి వారసం. ఊర్ల సరుకునేదు. రేపుగాని మనం సరుకు ఒట్టుకొచ్చామా, మరింకజూసుకో. ఒంద గేలన్ల సరుకూ గంటల కలాస్! మంచి సరుకు సవగ్గ తెచ్చీ పోసీనాది. కాని సేతల కాన్లేదు. యాబయ్య యినా బజానా యిస్తేగాని ఆడు

సరుకివ్వడు. యాబయ్ యిస్తే రొండందల సరుగ్గాదు అయిదొందలదైనా యిమ్మంటే యిచ్చేస్తాడు. మరేటంటావు? నాబం సెరిసగం! సరుకు రప్పించే పూసీనాది. అమ్మకం పూసీ నాది. నష్టం వస్తే ఎట్టుకునే పూసీనాది. మరేటంటావ్" అని గురుణ్ని ప్రశ్నించేడు.

గురుడు గుణిసేడు? నయాపైసా లేదన్నాడు. ఉంది కాని అది మరొకరిదన్నాడు. ఇవ్వడానికి వీల్లేదన్నాడు. ఇచ్చేస్తేయెలా, వున్నదే అదికాదా! అన్నాడు. చివరికి యిచ్చేడు. ఇచ్చేముందు బుడ్డిదీపం వెలిగించి, డబ్బు సరిగా లెక్కెపెట్టి మరీ యిచ్చేడు.

"సూసేవా గురూ! డబ్బు అవుపించేసరికి దీపం ఎలా యెలిగిందో?" అన్నాడు రాకెట్టు, పంట్లాం జేబులోకి డబ్బు దోపుతూ.

"వింటికిదీపం విల్లాలు గురూ!" అన్నాడు గురుడు.

"దాని నీకప్ప జెప్పే పూసీనాది" అన్నాడు రాకెట్టు.

మర్నాడు సాయంకాలానికల్లా వర్షం బాగా వెలిసింది. మబ్బులన్నీ తేలిపోయాయి. ఆకాశం నిర్మలంగా వుంది. రాత్రి పదిగంటల సమయంలో పోలీసు స్టేషన్ లో హెడ్డుగారు చొక్కా విప్పేసి, తెల్లని బనియానూ, ఖాకీ నిక్కర్తో కుర్చీలో కాళ్ళు ముడుచుకు కూర్చొని లోకాన్నీ, డిపార్టుమెంటునీ బూతులు తిడుతున్నాడు. అతనికి నలభై సంవత్సరాలుండొచ్చు. దళసరిగా వున్న అతని ముఖం భీకరంగానూ, బద్ధకంగానూ వుంది. అతని కళ్ళు నిద్రకళ్ళు.

"ఇదెక్కడ పోలీసుద్యోగంరా నాయనా! సస్తన్నాం!" అని ఎదురుగా ఉన్న జవాన్తో సెప్పున్నాడు. తెల్లార్లేస్తే నాలుగు సెవాలు, పదేక్సిడెంట్లు, యిరవై సోరీలు! ఈటితో సస్తంటే ఇయి సాలక ఎయ్యిమందికి బందోబస్తులు. రోజుకి పీకలమీదికి తోక తక్కువ తొంబై మంది మినిష్టర్లు, అయిదరాబాదోళ్ళు యిరవై, సెంటలోళ్ళు అరవై! ఎడ్డికేసన్ మినిష్టరొహడు, ఎగ్రికల్చర్ మినిష్టరొహడు,ఎగిరిగెంతే మినిష్ట రొహడు! ఈళ్ళందరికోసం ఎండల మన పడిగాపులు. తిండుండదు. కంటిమీద కునుకుండదు. ఈలోపల, 'నా పెల్లం నెగిసిపోయింది' సార్ 'నా కూతురు కనిపించదుసార్' 'నా మొగుడు తొంగోడంటసార్' 'నాయత్త కొట్టిందిసార్' ఇలా యెయ్యి కుక్కజట్టీలా కంప్లేంట్లూను. అన్నింటికీ అందరికీ పోలీసోడే కావాల! మొన్న ఆడెవడో పెద్దకంపెనీ డైరెక్టరట, డవిరెకటరు-ఆడి పెరట్లోకి పెద్ద పామొచ్చిందని పోను! పోలీసోడికి పాంమంత్రం రావాలనుకున్నాడో ఏటో లంజికొడుకు. దేసెంల యింతమంది లంజికొడుకులూ ఉన్నారుగాని ఒక్కడూ కాణీ కసగడు గదా! ఎవణ్నెత్తిమీద సేతులెడదామా అని మనం యెయ్యి కళ్ళతో యెదుకుతుంటే, ఎనకనుంచి సబిన్స్పెట్రుబాబు మననెత్తి మీన యేస్తాడు అస్తం! బాబుది మాసల్లటి సెయ్యికదూ! ఎయ్యగానే అక్కడికాడు బస్మం. ఒక్క నెలకి ఎయ్యి రూపాయలు ఎందర్నెత్తిమీద సెయ్యేస్తేగాని కిడతాయి?

ఆడి బాబుగోరు సామ్మా? ప్రజలసొమ్ము; అందల మన కేటైనా వుందా? కాణ్లేదు! పరువూ, మరియాదా వొదులుకు ఈణ్నీ ఆణ్నీ బక్కరగా బక్కరగా నెలకి నూరు కిట్టడం బెమాండంగుంది మనకి. అదైనా ఒట్టినెపోనిస్తారా అయ్యలు? మనకాడికొచ్చీసరికి రోజుకి నాలుగు శార్జీలు, ఆరు షోకాజులూను! ఏదీ కతక్కుండా కట్టినకేసు కట్టినట్టుగా దరియాప్తుచేసి కోర్టుకి పట్టికెలితే అక్కడ పీకలమీదికి రాబందుల్లా ఈ పీడరుగాళ్ళొహళ్ళు! ఈ సాక్షికాలు లంచాలు తినీడం కేసుల కెస రెట్టీడం! ఏం చెప్పమంటావు మన బాధలు?! ఇంక ఆ మేస్ట్రీటోపాపం? శిన్న పిల్లల్జూస్తె జడుసుకు మంచాలెక్కేయాలన్నమాట. ఆడియెనకాల ఆడికి కావలసిన శాకరీ సెయ్యక గట్టిగ బిగిద్దారంటె కేసు కేసుకి మనకి యెయ్యి లొసుగులు. కడకి కేసులన్నీ ఎక్విట్టు; మాటిమాటికి మనమీద టిక్చర్సు! ఈ లోపల కంటికి కునుకుండదు. కడుపుల టీ సుక్కలే తప్ప గెంజినీళ్ళయినా వుండవు. ఇలా కొట్టుకు సచ్చి సచ్చి ఇంటికి పోదారంటే దారే తెలకుండా వుంది. మొన్న సాయంత్రం ఆరింటికి ఇంటికెళితే గుమ్మంల గుమ్మటంలా నిల్సుందొరె! సూచి గుమ్మయిపోన్సు. సిన్న సిరునవ్విసిరిపారేసి, 'ఎవరుపిల్లా. ఎవరు కావాల?' అన్నాను. అంటే 'ఆసికాలా? ఏసికాలా? లేకపోతే డోసెక్కువైందా' అందది. సూస్తే యింకెవరు? నా పెళ్ళాం! ఇయిరా బాబూ మనుద్యోగాలు! పెళ్ళాన్ని పోల్తి పట్టలేని ఉద్యోగాలు. జీతం నెలకి నాలుగుపదులు, పన్జూస్తే పనిబరువు నాలుగొందలు. ఏదో మోటు సామెత జెప్పినట్టుంది, యవ్వారం అంతాను. ఏది! బేగెళ్ళి ఒకమంచి టీ–బాగా–యేడిగుండాల–పట్టుకు గుప్రా! ఆరుకాస్లరవుజెప్పు కరువుల అదికమాసం, కాన్లేక సస్తంటే ఇయాళ్టాక వొరసం ఒకటి. ఇయాళైనా ఓ సారా బెయిలైనా, ఉంటుందో! ఉండదో! ముందు నువ్వెళ్ళి బేగిరా!" అని హెడ్డుగారు అంటూ ఉండగానే ఫోను గుర్రున మోగింది.

తిట్టుకొంటూ ఫోన్ తీసి "చిత్తంసార్; సరే సార్; అవును సార్; సరేసార్; సరే....చిత్తం. సెలవు" అని ఫోను పెట్టేశాడు హెడ్డు.

"చస్తుంటే సవ్వనీకండ ఈ డొక్కుడా!" అని కేకలు వేశాడు.

సంగతేమిటి అంటే రాకెట్టుగాడు డియస్పీ దొరగారి దగ్గరికి వెళ్ళి ఇన్‌ఫర్‌మేషన్ ఇచ్చేట్ట – గురయ్యగాడు ఇవాళరాత్రి ఎగువనుంచి అరవై గేలన్ల సారా రప్పిస్తున్నాడు. ఆరుగురు కూలీల చేత ఆరు పెద్ద మోటారు ట్యూబులు మోయించు కొస్తున్నాడు. దారికాసి పట్టుకో వచ్చును. అదీ దొరగారికి రాకెట్టు యిచ్చిన భోగట్టా.

సారానీ, కూలీలనీ దారి కాసి పట్టుకోమని హెడ్డుగారికి డియెస్పీగారు ఆర్డరుజారీ చేసేరు.

పర్యవసానంగా, అదే రాత్రి ఒంటిగంటకి, మూసి వేసిన ఒక కిల్లీ బడ్డీకింద చీకట్లో కూర్చొని, లోకాన్ని బూతులు తిడుతున్నాడు హెడ్డు. ఆ చీకట్లో అతనూ, రాకెట్టూ, నలుగురు జవాన్లూ బడ్డీకింద తారుడబ్బాల్లా కనిపిస్తున్నారు. పక్కన కుళ్ళు కాలవలోంచి

మురికికంపు, జబ్బువాడి పగలా పట్టుకు వదలకుండా ఉంది. ఆకాశంలో చుక్కలన్నీ చలికి గజగజ వణకుతున్నాయి.

"ఏరా లంజికొడకా! ఎవడూ అవుపించడేంరా?" అన్నాడు హెడ్డు.

"ఇంకా టయం కానేదు" అన్నాడు రాకెట్టు.

"ఆళ్ళు రాకపోతే నీ టయం ఇవాళ్తోసరి" అన్నాడు హెడ్డు.

చుట్టూ అంతా చీకటి చీకటిగా ఉంది. బురదబురదగా చాలా చిరాగ్గా ఉంది. కొంపలు మునిగిపోయినట్టు కప్పలు బెకబెకలాడి చంపేస్తున్నాయి. దోమలు, రెక్కలొచ్చిన కండచీమల్లా తినేస్తున్నాయి.

"దేసెంమీద, ఎడ్డుగారూ, ఇన్ని కప్పలేటి? అన్ని దోమలేటి" అని ఒక జవాను నెమ్మదిగా అన్నాడు.

"వాటినలా ఒగ్గీ! ఈ కంపుమాటేటి? గోదారొచ్చి కొట్టేసినా ఈ కుళ్ళొగ్గదు" అని మరో జవానన్నాడు.

"సలిసలీ" అన్నాడు రాకెట్టు.

"సవ్వు లంజికొడకా" అన్నాడు హెడ్డు.

రాత్రి ఒంటిగంటదాటి రెండయింది. రెండున్నరదాటి మూడయింది.

తెల్లవారుజాము నాలుగయింది. అయిదున్నరకి తెల్లవారింది.

కాని, గురయ్యా లేడు, కూలీలు లేరు, సరుకూలేదు,

హెడ్డుగారు "ఏరా లంజికొడకా!" అన్నాడు రాకెట్టును ఉద్దేశించి.

"గురయ్యగాడు-నంజికొడుకు-ఇయాళ మస్కా కొట్టేసినాడు బాబూ! అయితే, ఇయాళ్తో అయిపోయిందేటి? ఇయాళ కాకపోతే రేపైనా దొక్కడా? పట్టప్పజెప్పే పూసీ నాది" అంటూనే గబా గబా వెళ్ళిపోయేడు రాకెట్టు.

"ఇలాటి లంజికొడుకుని నమ్మేడా డియస్పీ ఛత్తెరి! ఆడికి డియస్పీ ఉద్యోగం ఎవడిచ్చేడ్రా?" అన్నాడు హెడ్డు.

" ఆ బాబుని కూకడ బెట్టాల్సిందీ సల్లో" అన్నాడు ఒక జవాను.

"ఆళ్ళకి రగ్గులకింద తొంగోడాలు, మనకి సల్లో సవ్వడాలూ" అన్నాడు మరొక జవాను.

"నడండ్రా నాయిన్లారా నడండి. ఏటనుకుంటే ఏం లాభం? నడండి" అంటూ దారితీశాడు హెడ్డు.

ఇదంతా జరిగిన మూడోరోజు సాయంకాలం నూకాలమ్మ గుడి దగ్గర కిల్లీబడ్డీ దగ్గర రాకెట్టు విసురుగా నడుస్తూ వస్తున్నాడు. సిల్కుచొక్కా, తెల్ల పంట్లాం. చుక్కల

కర్చీఫూ పువ్వుల్లా ఉన్నాయి. నోట్లో సిగరెట్టు వేళాడుతోంది. ఎడమ చేతిలో అగ్గిపెట్టె కుడిచేత్తో హుషారుగా లయపడుతోంది. ఆ సమయంలో ఆ గుడిదగ్గర ఆ రాకెట్టుని అటకాయించేడు గురయ్య.

"గురూ గురూ అంటూ, నంజికొడకా, ఏట్రా ఏటిజేసేవు? ఇదా నువ్వు జేసినపని! నా డబ్బేది? నా సరుకేది? నా సరుకమ్మిన డబ్బేది? సెప్పు నంజికొడకా?" అని కేకలు వేసేడు గురయ్య.

గురువుని ఒక్క ఊపూపి చొక్కా విడిపించుకున్నాడు రాకెట్టు. తరువాత, నలిగిన బట్టల మడతలన్నీ సర్దుకున్నాడు. మెళ్ళో రుమాలు ముడివిప్పి తిరిగి సరిగా కట్టుకున్నాడు. ఆ తరువాత జేబులోంచి అయిదు కాయితాలు తీసి గురువు చేతికిచ్చేడు.

"నెక్కెట్టుకో! యాబయ్యా ఉంటాయి. అయిదు పదులు. కాణెక్కువనేదు. కాణి తక్కువనేదు; మంచోణ్ణి కాబట్టి నీడబ్బు నీకిచ్చేసినాను."

"నా మదుపు నా కిచ్చేసినావు. మరి సరుకమ్మిన సొమ్మంతా ఏటిసేసేవు? అందల నా వోటా ఏది?"

"మరింకేం మాటాడక! మాటాడొద్దంతే! డబ్బుండాల, మాయుండాల, డబాయింపు సెక్సనుండాల! పాటం సెప్పినందుకు నీవోటా నా పీజు కర్సుకి సెల్లు, మరింక బేగి ఇంటికెళ్ళిపో! నోరెత్తె తంతాను" అని చెప్పేసి, కొత్తబూట్లు టకటక లాడించుకొంటూ వెళ్ళిపోయాడు రాకెట్ అప్పారావు.

అదేరోజున అదే సమయంలో పోలీసు స్టేషన్లో ఒక జవాను తొందరగావచ్చి హెడ్డుగారితో, "ఏదండోయ్ యెడ్డుగారు! ఆయాళ ఆ రాకెట్ అప్పారావుగాడేం జేసేడో తెలిసిందా?" అన్నాడు.

"ఏం జేసేడు?"

"అదిగో పులి, అన్జెప్పి మన్ని ఆ దిక్కుల బడ్డీకింద తెల్లర్లూ కూకడ బెట్టేడు, ఇవతల ఈ దిక్కుంట చల్లగ సడిసప్పుణ్ణేకండ ఇరవై గేలాంల సరుకు రొప్పించేసుకున్నాడు. ఎంత మాయలంజికొడుకో కనిపెట్టేరా? సంగతంతా ఇయాళ తెలిసింది నాకు."

"అమ్మ, పొట్టిలంజికొడుకు! ఎంత పన్జేసేడు? ఆయాళ సల్లో బిగిసి పోయిన జాయింట్లు ఇయాల్టికింకా సరిగా యిడ్డంలేదు. మంగలాడు పావినా ఈ యెడంకాలింకా సరిగ సొక్కుండుంది! అమ్మలంజికొడుకెంత పన్జేసేడు!? సూడూ! నువ్వెళ్ళి ఆ లంజికొడుకు ఎక్కడుంటే అక్కడకెళ్ళి పిలకట్టు కీడ్చుకొచ్చి కొట్లో అడెయ్! 'అర్ధరేత్రి స్మెశానం అవతల గోనెమూటల మోటారు ట్యూబుల నాలుగ్గేలంల సారా బుజాన్నెత్తుకు మోసుకొస్తున్నాడు. అనుమానంమీద సెకింగ్ జేసి పట్టుకున్నాము. స్మెశానంకాడ దెయ్యాలప్పు ఏరే మద్దెవర్తులు దొరకనందున యీ అక్కెరెన్సు రిపోర్టు 'రాయడమైనది' అని ఆడిమీద కేసు పెట్టకపోతేసూడు. మోసం కేసే, దగాయే,

అన్నేయండవే! కాని ఏ మేస్ట్రీటు కేసు కొట్టేస్తాడో, కొట్టేడాని కాడి కెన్నిగుండెలున్నాయో నానూ సూస్తాను. బోనెక్కి పోలీసోడు జెప్పిన మాటకి తిరుగులేదంటేలేదని యెయ్యి తీర్పులున్నాయి. అంచేత, ఎళ్ళు బేగెళ్ళి ఆణ్ణొడ్చుకురా?" అని జవాన్ని తగిలేరు హెడ్డుగారు.

విశాలాంధ్ర దినపత్రిక. 30-4-1961